
# పెళ్ళి కూతురు



మునిమాణిక్యం

• యాజ్ఞవల్క్య •

ఆ రోజు సాయంకాలము నేను కాలేజీనుంచి వచ్చినప్పుడు ఒక పొడుగాటి ఆయన కుర్చీ కూర్చొని మా నాన్నగారితో మాట్లాడుతున్నారు. నేను రావడంతోనే సంభాషణ ఆగిపోయింది. చేతిలో ఉన్న పుస్తకాలను నా అలమారలో సర్దుతూ ఉంటే మా నాన్నగారు ఆయనతో "వీడేనండీ మా పెద్దబ్బాయి" అని అన్నారు. నన్ను గురించి ఏమిటో చెబుతున్నారో? అని అట్లాగే ఒక నిముషం నిల్చొన్నాను. ఇంకా అక్కడే నిల్చోవడం చూచి మా అమ్మ తలుపు ప్రక్కనుంచి పిలిచింది. నేను లోపలకు వెళ్ళాను.

"నిన్ను చూడటానికి వచ్చారురా అబ్బాయి" అన్నది. 'నన్ను చూడటం దేనికి' అన్నాను. "ఆఁ ఏముంది... పెళ్ళి మాటలకు వచ్చారురా" అని చెప్పి లోపలకి వెళ్ళింది. ఆ మాటలు వినంగానే నాకు ఎందుకనో ఎక్కడలేని సంతోషం పుట్టుకొచ్చింది. "అరెరె! ఆడుకొని రావడంచేత జుట్టు చెదిరి మొహం అంతా చెమటలు పోసి నయ్యే. అందుచేత అసహ్యంగా ఉన్నానేమో" అని అనుకొన్నాను. వెంటనే ఒక ఉపాయం తోచింది. ఒక్క గంతులో స్నానాల గదిలోకి పోయి సబ్బుతో ముఖం రుద్దుకొని లోపలకు వచ్చి మంచిదుస్తులు వేసుకొని, నిలువుటద్దం ముందు చాలాసేపు తల దువ్వి, ఇక ఫరవాలేదనుకొని, మళ్ళీ ఆయనగారితో మాటలు కలిపిద్దామని హాల్లోకి వెళ్ళాను. కాని నా నిరుత్సాహానికి మేరలేదు. మా నాన్నగారూ ఆయనా కలిసి చాలాదూరం వెళ్ళిపోయారు. అప్పుడు ఏకాఎకిని మా అమ్మ దగ్గరకు వెళ్ళి, కాఫీ తాగుతూ "ఎవరమ్మా ఆయన?" అన్నాను. మా అమ్మ "వారిది బెజవాడట. వాళ్ళమ్మాయి అయిదో ఫారం చదువుతోందట. పిల్ల ఎఱ్ఱగా బాగానే ఉంటుందట. కాకపోతే కొంచెం పొట్టట. నీకిద్దామనుకొంటున్నారు" అని చెప్పింది. కాఫీ తాగేసి హాల్లో పడక కుర్చీలో పడుకొని ఆలోచన మొదలు పెట్టాను. "చదువుకొన్న పిల్లే గదా... బాగానే ఉందిట, కాని ఒక్క విషయం కూడా చూడాలి, సన్నగా ఉందో లావుగా ఉందో — ఛా! అయినా మన కెందుకు పెళ్ళి. 'వివాహో విద్య నాశాయా' అంటారు పెద్దలు అని చిట్టచివర కనుకొని కాస్త అట్లా చల్లగాలిలో తిరిగొద్దామని వెళ్ళాను.

ఆ రోజు రాత్రల్లా అవే ఆలోచనలు. "పెళ్ళి చేసుకొంటే స్నేహితులందరూ నవ్వుతారేమో. ఆ ఎందుకు నవ్వుతారూ... మనం నవ్వుతున్నామా పెళ్ళిచేసుకొన్న స్నేహితులను చూసి... మనం ఎవరినన్నా ప్రేమించి అప్పుడు పెళ్ళిచేసుకోవాలనీ, లేకపోతే ఏ కులాంతర వివాహమో చేసుకొని సంఘాన్ని కాస్త బాగుచేదామని అనుకొన్నవాణ్ణి ఈవిధంగా అంతకుముందెన్నడూ చూడని అమ్మాయిని పెద్దవాళ్ళ సహాయంతో చేసుకోవడం మన డిగ్నిటీకీ, ఆశయాలకూ భంగం కలుగుతుందేమోనని కొంతసేపూ, అంతకుముందు మనం ఎవ్వరిని లవ్ చేయలేదుకదా. ఈ అమ్మాయి


బాగుండి నచ్చితే ఈ పిల్లనే లవ్ చేసి పెళ్ళి చేసుకోవడంలో అభ్యంతరం ఉండదుగదా అని కొంతసేపు అనుకొని, అయినా తొందరపోతూ రుచులెందుకులే అనుకొన్నాను. ఆ నల్లటాయన అన్న చివరిమాటలు జ్ఞాపకంవచ్చాయి: "మీరు ఎల్లాగో అల్లా వెడుతున్నే ఉన్నారు. కాస్త దిగి రేపు మా యింట్లో అమ్మాయిని కూడా చూసి వెళ్లండి, శ్రమ అనుకోకండేం..."

... ... ...

మర్నాడు పొద్దున్నే నన్ను తొందరపెట్టి నాన్నగారు ప్రయాణమైనారు. నేను ఒక పొడుగు లాగూ, ఒక బాగా పొడుగు పెట్టిన... మోకాళ్లకు బాగా కిందకు పెట్టిన చొక్కాను తీసికొని సంచీలో పెట్టుకొని బయలుదేరాను. మా నాన్నగారు ఓ నాలుగు పుస్తకాలూ, ఉపన్యాసాలు వ్రాసిన కాగితాల ఫైలూ మరో సంచీలో పెట్టుకొని బయలుదేరారు. మే మిద్దరమూ కలిసి స్టేషనుకు వెళ్ళాము. నేను ప్రశ్నించి ఎందుకు, ఎక్కడికి వెళ్లుతున్నామని ప్రశ్నించలేదు. ఎందుకంటే నిన్న ఆయన చెప్పి వెళ్ళాడుగా అక్కడికే వెడుతున్నాము. ఇంకా ఇందులో అడిగేది ఏముందీ అని అనుకొన్నాను.

పది గంటలకల్లా బెజవాడలో వారింటికి చేరుకొన్నాము. నేను ఊహించుకొంటున్నదే జాగ్రత్తపడ్డాను ముస్తాబు విషయంలో. ఆయన మమ్మల్ని లోనికి ఆహ్వానించి కూర్చోమన్నారు. ఆయన కెదురుగా మా నాన్నగారూ, ప్రక్కగా నేనూ కూర్చొన్నాము. కూర్చొన్న పది నిముషాలకు ఆయన "అమ్మాయీ మంచినీళ్లు పట్టుకురా అమ్మా" అని కేకవేశారు. రెండు నిముషాలయినతర్వాత ఒకమ్మాయి నీళ్లు తీసికొనివచ్చి నాకూ మా నాన్నగారికీ ఇచ్చింది. ఇచ్చి, ఆ అమ్మాయి వెళ్ళిపోతుంటే మా నాన్నగారి నుద్దేశించి వీరు 'ఫలానా' అని చెప్పి, నేను వారి పెద్ద కుమారుణ్ణని కూడా చెప్పి నన్ను పరిచయం చేశారు. ఆ అమ్మాయి 'నమస్కారమండీ' అంది.

ఆయన "అల్లా కూర్చో అమ్మా నిల్చోవడం దేనికి" అన్నారు. ఆ అమ్మాయి నా కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చొంది. మా నాన్నగారూ ఆయన ఏదో మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. నేనెందుకనో కాస్త తలకాయ వంచుకొని కూర్చొన్నాను. కాని ఆ అమ్మాయి మాత్రం నావంకే చూస్తున్నట్లు గమనించాను. నాకే సిగ్గేసింది.



ఆ అమ్మాయే నావంక అంతసేపు చూసిందో నేను మాత్రం ఆ అమ్మాయివంక కాసేపు చూస్తే. ఎందుకు చూడకూడదు! చివరకు ధైర్యంగా తలెత్తి చూశాను నా ఎదురుగా ఉన్న ఆ అమ్మాయిని.

సన్నని పూలవోణీ వేసింది. సన్నగా, పొడుగ్గా, నాజూగ్గానే ఉంది. పొడుగులో దాదాపు నా ఎత్తే ఉంది. ఏమెంత పెద్ద అందంగానూ, ఏమంత ఎబ్బెట్టుగా గాదు. ముక్కు మొగమూ బాగానే ఉన్నట్లుగా తోచింది. ఫేషన్‌గా ఉంది. ఈ అమ్మాయినే కాబోలు నా కిద్దామను కొంటున్నది అని అనుకొన్నాను. ఇంతలోనే మా నాన్నగారు "ఈ అమ్మాయేనా... అని ఆగి... మీ పెద్దమ్మాయి" అని నవ్వుతూ అడిగారు. అప్పుడే పెద్దదైంది అని తిరిగి నవ్వుతూ అన్నారాయన. నేనప్పుడు నిశ్చయించుకొన్నాను ఆ అమ్మాయే పెండ్లికూతురని. అప్పుడు నాకేదో అనిపించింది. నేను చాలా సేపటివరకూ తలకాయ వంచుకొని వారి సంభాషణ వింటూ కూర్చొన్నాను. కొంత సేపయిన తరువాత ఆయన నా పేరూ నేనేం చదువుతున్నదీ అడిగారు. నేను చెప్పాను. అంతటితో ఊరుకోక నాకు క్రిందటి సంవత్సరం పరీక్షలో ఎన్నిమార్కులొచ్చాయని అడిగారు. చెబితే ఏమవుతుందో నాకొచ్చినవి తక్కువను కొంటారేమో. అరెరె! ఇల్లా పెళ్ళిముందు మార్కులడుగుతారని తెలిస్తే బాగా చదివివుండే వాణ్ణే! అనుకొని పెద్దమనిషిముందు అబద్ధంఆడితే బాగుండదని నిజం చెప్పేశా ఏదో యాభై పర్సెంటు వచ్చాయని. ఆయన సంతోషించాడు. నాకా మార్కులతో పరీక్ష ప్యాసయినప్పుడికంటే అప్పుడే ఎక్కువ ఆనందం కలిగింది. ఆయన "అమ్మాయీ, వారబ్బాయిని లోపలకు తీసికొని పోయి కాస్త కాఫీ అదీ ఇవ్వు" అన్నారు. ఆ అమ్మాయి లేచి రమ్మన్నట్లుగా నావంక సిగ్గు పడుతూ చూసింది. నేను లేచాను. నన్ను తన గదిలోకి తీసికొనివెళ్ళింది. గదిలో మధ్యగా ఒక టేబులూ ప్రక్కన రెండు కుర్చీలూ ఉన్నాయి. టేబులుమీద ఒక తెల్లటి టేబులుక్లాతు పరిచి ఉంది. నన్ను ఒక కుర్చీలో కూచోమని మరో





ఈ విధంగా బార్లి గంజిని చేయడం సులభం

రెండు టీస్పూనుల బార్లీని ముద్దగాచేసి. ఒక పైంటు నీళ్లలో కలిపి ఐదు నిమిషములవరకు కాగనిచ్చి, రుచికి ఉప్పునో, చక్కెరనో చేర్చాలి. ఎంతో తేలికగా ఐదు నిమిషాలలోనే మీకు రుచికరంగా. హాయిగా ఉండే పానీయుం, తయారౌతుంది-జబ్బుగాఉన్న రోగులకూ, జబ్బుపడి తేరుకుంటూ ఉన్నవారికీ చాలా ప్రశస్తమైనది.

మంచి గింజలను పిండిచేసి తయారుచేసిన ప్యూరిటీ బార్లి సీలుచేసిన డబ్బాలలో ప్యాకు చేయబడుతున్నది. ఇది పెరల్ బార్లి కంటె ఎనిమిదిరెట్లు ఎక్కువ శ్రేష్ఠమైనది. ఇందువల్ల ఎంతకాలమూ, శ్రమా మీకు కూడివస్తాయో ఆలోచించండి.

ప్యూరిటీ
ఇండియన్ బార్లీ

కుర్చీలో ఆమె కూర్చొంది. ఆతరువాత నన్నేవో ప్రశ్నలడిగింది. మా కాలేజీని గురించీ, కాలేజీ స్టూడెంట్సుని గురించీ, లేడీ స్టూడెంట్సును గురించి అడిగింది. నేను క్లుప్తంగా జవాబులు చెప్పాను.

సంభాషణ చాలాసేపుదాకా పొడుగింపబడింది. తను గీసిన బొమ్మలను నాముందు పడేసి "చూడండి నేనే గీశానివ్వి" అని చెప్పి లోపలకు వెళ్లింది. కొన్ని నిముషాలకు తిరిగివచ్చింది. రెండు కప్పులతో కాఫీ తెచ్చి, ఒకటి నాకిచ్చి తనొకటి పుచ్చుకొంది. "బొమ్మలు బాగున్నాయా" అని అడిగింది. నేను అవి, నిజానికవి బాగుండక పోయినా మెచ్చుకోక తప్పిందికాదు. నేను మళ్లీ ఒకటి రెండుసార్లు ఆ అమ్మాయివంక చూశాను. నాకు దాదాపు మంచి అభిప్రాయమే కల్గింది.

ఇంతలో ఆయన 'అమ్మాయీ' అని కేక వేశాడు. నేను కూడా తిరిగి హాల్లోకి వెళ్లాను. అప్పుడు నాన్నగారు ఆయనతో 'ఇంక సెలవు తీసుకొంటానండీ' అంటూ లేచారు. ఆ పూటకు వారింట్లో ఉండమని ఆయన చాలా కోరాడు. నిజం చెప్పవలసివస్తే నాకా పూటకు అక్కడే ఉండాలనిపించింది. కాని నాన్నగారు "ఉండటానికి వీల్లేదండీ. నేను సాహిత్యసభలకు ఏలూరు వెళ్లాలి. దార్లోనేగదా అని మీ యింటికి వచ్చి చూచి వెళుతున్నాను. మరేమీ అనుకోకండి' అని నచ్చజెప్పి నన్ను తీసికొని బయలుదేరారు.

నాకు దారిపొడుగునా ఆలోచనే. ఎంత నవీన పద్ధతుల్లో పెరిగిన పిల్లయినా నాగరకత నేర్చినా ఇంత మరీ త్రపారహితయై ఉండటం... అందులోనూ తన్ను చూడటానికి వచ్చిన పెండ్లికొడుకు ముందు—అంత బాగుండలేదేమో ననిపించింది. కాని నేనే చాలామాట్లు స్నేహితులతో స్త్రీలు సంఘంలో సోషల్‌గా తిరుగుతూ నిర్భయంగా మాట్లాడాలంటూ చెప్పిన మాటలన్నీ (చిన్న ఉపన్యాసాలు) జ్ఞాపకం రావడంమూలాన్న నాకు నేనే సమర్థించుకున్నాను.

ఏలూరులో ఉపన్యాసాలయి, వెనుతిరిగి బందరు వచ్చేశాము. బెజవాడ వెళ్ళివచ్చి అప్పటికి వారమైంది. కాని నా పెండ్లి సంబంధం మాట ఎవరూ ఎత్తలేదు. ఆ నల్లటాయన అక్కడ కన్పడలేదేమో అని చాలాసార్లు అనుకొన్నాను. ఆయనేదో మధ్యవర్తి అయిఉంటాడనీ, పని అయిపోయింతర్వాత కనపడవలసిన అవసరం ఉండదనీ అనుకొన్నాను.

తరువాత కొన్నిరోజులకు, మా అమ్మ నాన్నగారితో "ఆ నల్లటాయన మళ్లీ రాలేదే! బెజవాడలోనూ కలుసుకోలేదూ?" అన్నది. పోనిద్దూ వెధవ సంబంధాలు ఏమంత పెద్దవయస్సు వచ్చిందనీ అన్నారు. "పోనీ గానిండే మొన్న మీరు బెజవాడలో మా అక్కయ్యగారింటికి వెళ్లారా" అన్నది మా అమ్మ. "లేదు ఈమాటు వెంకట్రామయ్యగారింటికి వెళ్లాను." అయితే అంతా కులాసాయేనా? వారి పెద్దమ్మాయి కాపరానికి వెళ్ళిందా? అని అడిగింది.

"ఆ! లేదు. నేను వెళ్ళినప్పుడు అక్కడే ఉంది. చదువుకొంటున్నది. అయినా చిన్నదేగా తొందరేం" అని అన్నారు.

నేనీ మాటలన్నీ విన్నాను. వినేటప్పటికి నాకు ఎక్కడలేని ఆశ్చర్యమూ వేసింది. నా నిరుత్సాహానికి మేరలేదు. అనవసరంగా భావాలు పెంచి అంతటా పారబడి ఆ అమ్మాయిని గురించి ఇల్లా అనుకోవడం చాలా తప్పనీ తెలివితక్కువ పనీ నిశ్చయించుకొన్నాను. అయినా ఇప్పుడప్పుడే మనకు పెళ్లేమిటి! లేకపోతేనూ.

పరాయి పిల్లనూ—అందులోనూ పెండ్లయిన పిల్లను గురించి ఇల్లా తలచుకోవడం మహాపాపమని చెంపలు రెండూ (ఎవ్వరూ చూడకుండా) వాయించుకొన్నాను.


నవ్వించే నాటిక :

వచ్చే సంచికలో చదవండి—

ఒకానొక ఎం. ఎల్. ఎ.
పూర్వజన్మ వృత్తాంతము

* సిలిసిడలు *

హాస్యరచనాప్రవీణ
శ్రీ మల్లాది వేంకటకృష్ణశర్మ
రచన